# ప్రార్థన
# 2

## విశ్వాసం

మనం ప్రార్థనలో తప్పిపోయాం ఎందుకంటె దేవునీ, విశ్వాసాన్నీ మనం అపార్థం చేసికొన్నాం. సర్వాధిపతియైన దేవుని మనం నొక్కి చెప్పకున్నప్పుడు, ఆయన ఘనతను మనం హీనపరచినట్టును, బైబిలు దాని అధికారాన్ని పోగొట్టుకున్నట్టౌతుంది. సంఘం దాని ప్రాధాన్యతను, విధేయత తన సద్గుణాన్ని కోల్పోయినట్టౌతుంది. దేవునికి యియ్యబడిన భక్తి మర్యాద సరియైన ప్రార్థనకు సారవంతమైన భూమియైయుంటుంది. ప్రార్థన దేవుని మొదటి స్థానాన్ని కోరుతుంది.

ప్రార్థనకు విశ్వాసాన్ని గూర్చిన సరియైన అవగాహన కూడా అవసరమైయుంది. నేడు జనులు ఎక్కువగా దేవుని గూర్చి మాట్లాడుతున్నారు – కాని బైబిలు దేవుని గూర్చి కాదు. పాపము, నశించిన స్థితి, శిక్షావిధి, ఉగ్రత, నరకము అనేవి జనులకు సమ్మతం లేనివయ్యాయి. అనేక మంది విశ్వాసాన్ని సమానంగానే వృద్ధి చేస్తారు – అయినా వాస్తవానికి వారు అంగీకరించేది – "విశ్వాసం మాత్రమే." విశ్వాసము, "విశ్వాసం మాత్రమే" అనేవి రెండు వేరైన భావాలు. విశ్వాసం పని చేస్తుంది, "విశ్వాసం మాత్రమే" అనేది మృతమైనది. (యాకోబు 2:17). మనం నీతిమంతులంగా తీర్చబడింది విశ్వాసం ద్వారానే కాని "విశ్వాసం మాత్రమే" అనేదాన్ని బట్టి కాదు. నవీన దైవశాస్త్రంలో యిది ఘోరమైన తప్పు. విశ్వాసం పని చేస్తుంది. "క్రియలులేని విశ్వాసము మృతము" అని యాకోబు అన్నాడు (యాకోబు 2:26). అనేకులు రక్షణను క్షణభంగురమైన విశ్వాసం మాత్రమునకే పరిమితి చేస్తారు. యాకోబు ప్రకారం "విశ్వాసము మృతమైనది" యిక్కడే. విశ్వాసం క్షణికం కాదు; విశ్వాసం జీవితాంతంకొరకు. "నీతిమంతుడు విశ్వాసమూలమున జీవించును" (రోమా 1:17; గలతీ. 3:11; హెబ్రీ. 10:38ని చూడు). విశ్వాసం క్రియ చేస్తుంది! హెబ్రీ. 11 చదువు. అది "పరలోకం యొక్క కీర్తి కూటమి." అక్కడ విశ్వాసం పని చేసింది! ప్రార్థన సరిగ్గా పని చేస్తుంది, కాని మనుష్యులు ప్రార్థన సరిగ్గా చేసినప్పుడే. ప్రార్థన ఒక ప్రయత్నం. ప్రార్థన సహనం. ప్రార్థన క్రియా రూపంలో ఉన్న విశ్వాసం. విశ్వాసులైన జనులు ప్రార్థిస్తారు ఎందుకంటె వారు దేవుని ప్రేమించి, ఆయనయందు నమ్మకం కలవాళ్ళు. నీవు ఈదడంవలన ఈత నేర్చుకుంటావ్. ప్రార్థించడంవలన ప్రార్థన నేర్చుకుంటావ్. ప్రార్థన గాఢమైనది. దేవుని చిత్తాన్ని మన చిత్తానికి వొంచుకోము, మన యిష్టాలే ఆయన చిత్తానికి వొంగునట్లు చేస్తాం. "మా చిత్తము పరలోకమందు నెరవేరును గాక" అని ప్రార్థన చేయము; "దేవుని చిత్తము భూమియందు నెరవేరును గాక" అని చేస్తాం.

చెడ్డవాటిని మరింత హాస్యంగా చేయడానికి – విశ్వాసాన్ని విగ్రహంగా కుదించుతారు – వారు నమ్మికయందు నమ్మికయుంచుతారు. తర్కానికి వ్యతిరేకంగా, వారు తమ విశ్వాసమందు గర్విస్తారు – తమ విశ్వాసమందు వారు అతిశయిస్తారు. విశ్వాసం దీన మనస్సును కలిగిస్తుంది. విశ్వాసం యొక్క ఘనత విశ్వసనీయమైన విషయంలో ఉంది. విశ్వసించే వానిలో లేదు. విశ్వాసం భ్రమకాదు. నిజం కాదని నీవు ఎరిగిన ఎదో ఒక దానిని నిజమని నమ్మడం విశ్వాసం కాదు. విశ్వాసం అనేది దేవునిపైవున్న నమ్మకం. విశ్వాసమందు విశ్వాసం కాదు. విశ్వాసం నిజాన్ని మార్చదు. విశ్వాసం యథార్థత లేనిది కాదు. (అబ్రాహాము యొక్క ఉదాహరణలో) విశ్వాసము అనిశ్చయమైనది కాదు. అబ్రాహాముకు మార్గ – పటం యివ్వబడలేదు. “ఎక్కడికి వెళ్లవలెనో ఎరుగకయే అతడు బయలువెళ్లాడు” (హెబ్రీ. 11:8బి). ఇది విశ్వాసం యొక్క సాహసం – అది నమ్మదగిన దేవుని చేతిలో మన చేయి ఉంచడం. “నీ విశ్వాస్యత గొప్పది” (విలాప. 3:23బి). విశ్వాసము అణకువయు, ఆధారపడునదియు, విడిచిపెట్టడమును, విధేయతయు, జీవితమునైయున్నది! మనం విశ్వాసంవలన రక్షింపబడ్డాం, పరిశుద్ధపరచబడ్డాం, మహిమపరచబడ్డాం, విశ్వాసం ప్రార్థిస్తుంది. ప్రార్థన విశ్వాసం యొక్క స్వరం. విశ్వాసం దేవునియందు నమ్మికయుంచడం, అహమునందు కాదు. విశ్వాసము తన విషయమై మృతముగాను, దేవునికి సంపూర్ణ సమర్పణగాను చేయునది. మన ప్రార్థనయే దేవుని గూర్చిన మన నిజ భావనయైయుంది. మన ప్రార్థన మన విశ్వాసం యొక్క నిజ భావనయైయుంది. విశ్వాసం ప్రత్యుత్తరమియ్యలేనిది; జవాబు లేకుండానే విశ్వాసం ఉనికిని కలిగి ఉంటుంది. దాన్ని జీవించునప్పుడు మాత్రమే ప్రార్థనకు అర్థముంటుంది. ప్రార్థనను, విశ్వాసాన్ని యోబు పూర్ణంగా నిర్వచించాడు: “ఇదిగో ఆయన నన్ను చంపినను, నేను ఆయన కొరకు కనిపెట్టుచున్నాను” (యోబు 13:15). దీనికి ఒకే ఒక ముగింపు ఉంది: “దేవుడు జీవితాన్ని గొప్పగా ఎరిగినవారు”! ప్రార్థన “దేవుని ఘనతను” స్తుతిస్తుంది.

నేను ఎనిమిది ఏండ్ల ప్రాయంలోనున్నప్పుడు, నన్ను బ్యాంకు అధికారి వద్దకు తోడుకొనిపోయాడు. నేను పాలివాడనని, నాచేత సంతకం చేయబడిన చెక్కులన్నిటిని డబ్బుగా మార్చాలని అతనికి చెప్పాడు. మా నాయన నాకిచ్చినది ఒక ఆధిక్యత, పవిత్రమైన అప్పగింత. ఆయన మరణించేవరకు అది నా ప్రత్యేకాధికారమైయుంది. నాకిచ్చిన అధికారాన్ని నేను దుర్వినియోగం చేయలేదు సరిగదా, దాన్ని నేను అవకాశంగా తీసికోలేదు. నేటికిని ఎన్నిస్ బ్యాంకులో నాకు ఒక ఖాతా ఉంది. మా నాయన ఏది యిష్టపడతాడో వాటిని చేయడానికి మాత్రమే ఆ డబ్బును వాడతాను. దేవునికి ప్రార్థించడంలో వారికున్న హక్కులను గూర్చి, అధికారంగా అడుగుతామని చెప్పుకునే – సువార్తికులనబడేవారి మాటలు వింటుంటే నాకు దిగ్భ్రమ కలుగుతుంది. ప్రార్థన స్వార్థమో లేక అహంభావమో కాదు. “దాన్ని అడుగు, అంగీకరించు”; “దాన్ని నమ్ము, దాన్ని సాధించు” – అనే ప్రతిపాదనలు గర్వంతో కూడినవైయున్నాయి. ప్రార్థనను పరిహాస పాత్రంగా చేయవద్దు.

# ప్రార్థన యొక్క శక్తి

## (యాకోబు 5:3-18)

*నీతిమంతుని విజ్ఞాపన మనఃపూర్వకమైనదై బహు బలముగలదైయుండును (యాకోబు 5:16బి).*

"అతి బలహీనుడైన పరిశుద్ధుడు మోకాళ్లమీద ఉన్నప్పుడు
అపవాది వణకుతాడు"

విలియం కౌపర్

మనమెందుకు ఎక్కువగా ప్రార్థన చేయము? దేవుడు ప్రార్థన విని, ప్రార్థనకు బదులిచ్చే దేవుడైయున్నట్టయితే మనమెందుకు ఎక్కువగా ప్రార్థన చేయము? ప్రార్థించేవారికి గొప్ప సంగతులు సంభవిస్తాయి. "దేవుడు ప్రతిదీ ప్రార్థనవలననే చేస్తాడు, అది లేకుండ ఏదీ చేయడని నేను నమ్ముతున్నాను" అని జాన్ వెస్లీ అన్నాడు. రోజుకు నాలుగు గంటలు ప్రార్థించని సువార్తికుని జాన్ వెస్లీ గౌరవించడు. "ఈ లోకం కలగనేదానికి మించి ఎక్కువ సంగతులు ప్రార్థనవలన జరుగుతాయి" – అని ఒక తాత్వికుడన్నాడు, తత్వ శాస్త్రానికి వివేచించడం ఏలాటిదో, మతానికి ప్రార్థన అలాటిదే. ప్రార్థనలు బిజీగా ఉన్నప్పుడు, శక్తిని పొందే అంత బిజీగా మనం ఉన్నామన్న మాట. మనం ప్రార్థన ఎందుకు ఎక్కువగా చేయము? ప్రార్థించేవరకు దేవుని అనేక దీవెనలు మనుష్యునికి యివ్వబడవు.

ప్రార్థనతో దేవుడు సహితం ఇంప్రెస్ అవుతాడు. అననీయను సౌలు వద్దకు పొమ్మని చెప్తూ, "... ఇదిగో అతడు ప్రార్థన చేయుచున్నాడు" అని ప్రభువు తెలిపాడు (అపొ. 9:11). మనిషి వద్దనుండి ప్రార్థనకంటె ఎక్కువ శ్రేష్ఠమైనది దేవునికి ఏదీ లేనట్టుంది. యోహాను యిలా వ్రాశాడు, "ఆయననుబట్టి మనకు కలిగిన ధైర్యమేదనగా, ఆయన చిత్తానుసారముగా మనమేది అడిగినను ఆయన మన మనవి ఆలకించుననునదియే. మనమేమి అడిగినను ఆయన మన మనవి ఆలకించునని మనమెరిగినయెడల మనమాయనను వేడుకొనినవి మనకు కలిగినవని యెరుగుదుము" (1 యోహాను 5:14, 15).

లోకాన్ని మార్చి, కదిలించిన మనుష్యులు ప్రార్థనాపరులైనవారే. దేవునితో మాట్లాడడం ఎంతటి భక్తిపూర్వకమైన భాగ్యమైయుంటుంది! దేవుడు మనుష్యుల మొరలను ఆలకిస్తాడు! ఇది బలహీనతకు గురుతు కాదు, కాని ప్రత్యక్షత యొక్క బలమైయుంది. దేవుడు దానిని అలా సంకల్పించాడు. జీవితం కొరకైన తన జ్ఞానంగల సంకల్పంలో, సంగతులు జరిగే విధానంగా దేవుడు మానవ ప్రార్థనకు ఒక మార్గాన్ని ఏర్పాటుచేశాడు.

**ప్రార్థన శక్తివంతమైనది, అయినా మనం ప్రార్థనయందు నమ్మికయుంచము-దేవునియందు విశ్వాసముంచుతాం.** ప్రార్థన స్పష్టపరచదు–దేవుడు చేస్తాడు. మనం దేవుని

సముఖానికి ప్రవేశం పొందేది ప్రార్థనయందే. ప్రార్థనలో సర్వశక్తుడగు దేవుని మన భాగస్వామిగా చేసికొంటాం. ఈ మహా విశ్వంలోని దేవుడు మన మొరను ఆలకింపగోరుతు, సహాయం చేయగోరుతున్నాడు! ప్రార్థనలో శక్తి ఉంది.

## ప్రార్థించు!

"నీతిమంతుని ప్రార్థన మనఃపూర్వకమైనదై బహు బలముగలదై యుండును" (యాకోబు 5:16బి). దీనిని నమ్ము! అనుసరించు. "ఏలీయా మనవంటి స్వభావముగల మనుష్యుడే; వర్షింపకుండునట్లు అతడు ఆసక్తితో ప్రార్థన చేయగా మూడున్నర సంవత్సరములవరకు భూమిమీద వర్షింపలేదు. అతడు మరల ప్రార్థనచేయగా ఆకాశము వర్షమిచ్చెను" (యాకోబు 5:17, 18). ఏలీయా యొక్క శక్తి ప్రార్థన! దేవుని సేవకుని యొక్క అతి ప్రాముఖ్యమైన పని ప్రార్థన. మొదటిగా ప్రార్థించు!

ఏలీయా ప్రార్థించాడు. గ్రీకులో చదివితే యిది ఆసక్తికరంగా ఉంటుంది. "అతడు తన ప్రార్థనలలో ప్రార్థించాడు." ఏలీయా దేవునియందు నమ్మికయుంచాడు, గనుక ప్రార్థించాడు. యథార్థంగా, ఆసక్తిగా, విశ్వాసంవలన ఏలీయా ప్రార్థించాడు! ఏలీయా ప్రార్థనలు ఉచ్ఛరించలేదు; అతడు తన ప్రార్థనలు ప్రార్థించాడు.

ఇక్కడ మరొక మంచి ఆలోచన ఉంది: ఎలీయా మనలాంటి గుణం కలిగిన మనిషి (వ.17). బైబిల్లోని కథానాయకులను మనం "సూపర్ స్టార్స్‌గా" లెక్క కట్టతాం. దానికి భిన్నంగా, వారు మనవంటి స్వభావంగలవారేనని బైబిలు తేల్చింది. దేవుడు ఏలీయా విన్నపాన్ని ఆలకించాడు, ఆయన మన మనవిని కూడా వింటాడు! "**ప్రభువు** కన్నులు నీతిమంతులమీదను ఆయన చెవులు వారి ప్రార్థనలవైపును ఉన్నవి" (1 పేతురు 3:12). 10,000 మంది సైన్యం కంటెను జాన్ నాక్స్ ప్రార్థనలకు ఎక్కువగా భయపడినట్టు క్వీన్ మేరీ అంది! ప్రార్థనలో బలం ఉంది. అది మనది!

ప్రార్థన "బహు" బలముగలదైయుండును. "ఎక్కువకు" "కొంచెం" అన్నది ఎదురవుతుంది. ప్రార్థన దేవుని మీద ప్రభావాన్ని కనుపర్చుతోంది! దేవుడు పని చేస్తాడు! లోకాన్ని చలింపజేసే చేతిని ప్రార్థన కదిలిస్తుంది. ప్రార్థన ఎంత శక్తివంతమైనది? దేవుడు ఎంత శక్తిమంతుడై యున్నాడు? యెరూషలేము సంఘం ప్రార్థించినప్పుడు వారు కూడియున్న స్థలం కంపించింది (అపో. 4:31). అడుగువాటికంటెను ఊహించు వాటికంటెను దేవుడు అత్యధికంగా చేయ శక్తిగలవాడైయున్నాడు (ఎఫెసీ. 3:20). మనం ఎక్కువగా ఎందుకు ప్రార్థించము? దేవుని శక్తిని ఉపయోగించుకోగలిగితే, సంఘం ఎంత శక్తివంతమైనదై ఉంటుంది? ప్రార్థన లేని సంఘం శక్తిలేని సంఘమైయుంటుంది. ప్రార్థించే సంఘం ఎంత శక్తివంతమైనదై ఉంటుంది? ప్రార్థన లేని సంఘం శక్తిలేని సంఘమై యుంటుంది. ప్రార్థించే సంఘం ఎదిగే సంఘంగా ఉండకుండడం నీవెన్నడు కానలేవు. **మొదట ప్రార్థించు!** బైబిల్లో 32,000 దేవుని వాగ్దానాలున్నట్టు కనుగొంటాం. దేవుడు ప్రార్థన వింటాడు, జవాబిస్తాడు. దేవుని ప్రతి వాగ్దానం నెరవేర్చబడింది.

ఏలీయా ప్రార్థించాడు, వర్షంరాలేదు; అతడు మరలా ప్రార్థించాడు వర్షం వచ్చింది.

రెండు ప్రార్థనలు అనుదిన జీవితానికి చెందినవే. పాలస్తీనాలోని వర్షం మధ్యధరా సముద్రం మీదుగా వచ్చేది. ఏ దిశగా చూడాలో ఏలీయాకు తెలుసు. అవును, దేవుని ప్రత్యేకమైన కటాక్షాన్ని చూడడంలో సమస్యలు అణగియున్నాయి. దేవుడు తానే మర్మమైయున్నాడు. దైనిక జీవితంలో నిజమైన ప్రజలలో ఏలీయా ఉన్నాడు. దేవుడు దైనిక జీవితంలో మనుష్యులతో పని చేస్తాడు. ఆహా, ఎలాటి దేవుడు!

ప్రార్థన మహా గొప్ప శక్తియైనా అయ్యుండాలి లేదా మహా గొప్ప మోసమైనా అయ్యుండాలి. మనం పని చేసినప్పుడు, మనం పని చేస్తాం; మనం ప్రార్థించినప్పుడు, దేవుడు పని చేస్తాడు! ఆత్మ సంబంధమైన మన శక్తి ప్రార్థనల దయమీద ఉంది. ఒక క్రైస్తవుని తన కాళ్లమీద నిలబెట్టాలంటే, మొదట అతణ్ణి తన మోకాళ్లమీద నిలబెట్టాలి. క్రైస్తవులు తమ జీవితాలను తమ సమస్యల మీద కాకుండ తమ శక్తిమీద కేంద్రీకరింప జేయాలి. **క్రైస్తవులు ప్రార్థించాలి లేక నశించాలి.** క్రొత్త నిబంధన సంఘం ప్రార్థించే సంఘం (అపొ. 2:42; 4:23-31). ప్రార్థనలేని స్టడీసైనా, ప్రసంగాలైనా, పనియైనా అపవాది భయపడడు. మన పనిని చూచి వాడు నవ్వుతాడు, మన జ్ఞానాన్ని వెక్కిరిస్తాడు. అయితే మనం ప్రార్థించినప్పుడు వాడు వణకుతాడు. ప్రార్థనలో శక్తి ఉంది. దీనిని నమ్ము.

## దేవుడు ప్రార్థనకు జవాబిస్తాడు!

“నా ప్రార్థనలు వినబడతాయనే నమ్మకం నాకు ఎక్కువ లేదు” అని ఒక వ్యక్తి మార్టిన్ లూథర్‌తో అన్నాడు. “అధికారాన్ని బట్టి నీవు ప్రార్థన చేయాలని” లూథర్ అతనికి జవాబిచ్చాడు. ప్రతి క్రైస్తవుని ప్రార్థనకు జవాబు లభిస్తుంది! విశ్వాసుల ప్రార్థనలు జవాబు పొందకపోవు. “ప్రార్థించని ప్రార్థన ఉంది” గాని, “జవాబు పొందని ప్రార్థన ఉండదు.” దేవుని అయిష్టాన్ని ప్రార్థన జయింపనేరదు; దేవుని యిష్టాన్ని అది జయిస్తుంది. దేవుడు ప్రార్థనలకు జవాబిస్తాడు! అది మన సమస్య కాదు. దేవుడు ప్రార్థనకు ఎలా జవాబిస్తాడు?

(1) **“అవును” అని దేవుడు జవాబిస్తాడు.** (ప్రేమగల తండ్రిలా) మనం కోరినదానిని దేవుడు ప్రసాదిస్తాడు. ఏలీయా ప్రార్థించాడు, వర్షింపలేదు. ఏలీయా ప్రార్థించాడు, వర్షం కురిసింది. హన్న కుమారుని కొరకు ప్రార్థించింది (1 సమూ. 1:11). దేవుడు ఆమెను సమూయేలుతోను యితర పిల్లలతోను ఆశీర్వదించాడు. ఇవ్వడానికి దేవుడు సజీవుడై యున్నాడు, జీవించగోరి హిజ్కియా ప్రార్థించాడు; దేవుడు అతని జీవితానికి పదిహేను సంవత్సరాలు చేర్చాడు (యెషయా 38:2-5). ఏదియెలాగున్నా, ప్రార్థనకు జవాబు మనమే నిర్ణయిస్తాం. దేవుడు జవాబు యివ్వగలిగింది ఒకే మార్గంలోనని మనం ఆలోచింప మొదలుపెడతాం. మేలైనదేదో పిల్లలకు తెలియదు; తల్లిదండ్రులకు తెలుస్తుంది. వారికి నిజంగా ఏమి కావాలో నరులకు తెలియదు; దేవునికి తెలుసు. “అవును” అని దేవుడు అన్నట్టయితే, ఎదురు చూడని పరిణామాలు కూడా కావచ్చు! మన జీవితాలే పెల్లగించి వేయబడవచ్చు. ప్రార్థనలో ఈ “అపాయముంది.” నీవు ఎలా ప్రార్థిస్తావో జాగ్రత్త-నీవు దాన్ని పొందవచ్చు! దేవుని యొద్దనుండి ఎదురుచూడని దాని కొరకు మనం ఎల్లప్పుడు సిద్ధపడి ఉండాలని విశ్వాసపు నడక అలోచిస్తుంది. దేవుని మనం “ఒక పెట్టిలో”

యిమడ్చలేం. నీవు చేయగలుగునట్టు ప్రార్థించు, చేయలేనట్టు కాదు. దేవుని మన జీవితాల్లోనికి ఆహ్వానించినప్పుడు, అన్ని రకాలైన సంగతులు సంభవించవచ్చు. గనుక, "దేవుని చిత్తం కొరకు ప్రార్థించు."

(2) **"లేదు" అని దేవుడు బదులిస్తాడు.** "లేదు," అనేది కూడా జవాబే! అది జవాబు కాదని మనమనుకుంటాం. ప్రార్థన అనేది ఏమీ లేకుండ ఏదో పొందే చౌకబారు రకం కాదు. దేవుడు దేవుడే, నరుడు దేవుడు కాదు. నరుని దేవునిపై యజమానునిగా చేయడానికి ప్రార్థన ఉపదేశింపబడలేదు. "అవును" అనేదానికి పర్యాయంగానే అనేకులు ప్రార్థన జవాబును జమకడతారు. తండ్రులు పిల్లలు కోరిందంతా ఎల్లప్పుడు యివ్వరు. మనం అడిగిన దానిని దేవుడు యియ్యకపోయినందున ఆయనను స్తుతించడానికి చాలినంత కాలం మనలో ఎక్కువ మందిమి జీవించాం. ప్రతి "అవును" అనేదానిలో సమానంగా "లేదు" అనేది సమస్యగా మిగిలి ఉంది.

అమూల్యమైన తన కుమారునికి గెత్సేమనేలో ముమ్మారు దేవుడు "లేదు" అని చెప్పాడు. 2 కొరింథీ. 12:8, 9లో, తన ముల్లును గూర్చి దేవుడు పౌలుకు "లేదు" అని తెలిపాడు. కొన్ని సార్లు "లేదు" అనేది శ్రేష్ఠమైన జవాబైయుంది. ప్రార్థనలో మనం దేవునితో మాట్లాడతాం. మనం దేవుని "చాతుర్యంతో" మోసగించలేం. అది మనకు యిష్టమైనా కాకపోయినా ప్రార్థనయందు మనం దేవుని జవాబునందు నమ్మికయుంచుతాం. ప్రార్థనయందు యేసు పొందినదేమి? కల్వరి!

(3) **దేవుడు "వేచియుంటాడు."** లూకా 1లో ఉత్కంఠను కలిగించే ఒక కథను మనం చూస్తాం. జెకర్యా ఎలీసబెతులు నమ్మకమైనవారు. అయినా, వారు సంతతిలేకయే ఉన్నారు. అనేక సంవత్సరాలుగా ఒక బిడ్డ కొరకు వారు ప్రార్థించియుంటారు. వారు యింకను దుఃఖంలో మునిగిపోయి ప్రార్థించియుంటారు. జెకర్యాకు దూత ఒక కుమారుని వాగ్దానం చేశాడు. అతడు ఉల్లసించలేదు! ఎందువలన? బిడ్డ కావాలని అతడు ఇరవై సంవత్సరాలకు ముందు కోరాడు! మన కాలమానం ప్రకారం దేవుడు పోవాలని మనలో ఎక్కువ మందిమి కోరతాం. దేవుని సమయం వేరైనదై యుండవచ్చు. "కేకవేయని నోరు మూతపడదు!" బాప్తిస్మమిచ్చే యోహాను జన్మించేవరకు జెకర్యా నోటి మాటలు లేనివాడైయుంటాడు. ఎలాటి కుమారుడో! వారు దేవుని మీద ఆనుకొనడానికి వారికి యిష్టం లేకపోయినట్టుంది, కాని "కాలం సంపూర్ణమైనప్పుడు," దేవుడు వారికి ఒక కుమారునిచ్చినట్టు చూడగలిగారు!

మరొక రమ్యమైన ప్రార్థన ఆది. 18:23–32లో ఉంది. సొదొమను రక్షించడానికి అబ్రాహాం ప్రార్థించాడు. దేవునితో అతడు బేరమాడాడు. ఏభై – సరే కనీసం 10 మంది నీతిమంతులున్నా సొదొమ రక్షింపబడియుండేదే. అప్పుడు అబ్రాహాము ఆగిపోయాడు! అయిదు, రెండు లేక ఒకటి సొదొమును రక్షించియుండేదా? ఎవరికీ తెలియదు … ఎందుకంటె, అబ్రాహాము దేవుని మీద ఆనుకొనడం ఆపివేశాడు.

యిర్మీయా 42:4–7లో దేవుడు యిర్మీయా ప్రార్థనకు జవాబిచ్చాడు, అయితే అది చేయడానికి ఆయన పది దినాలు ఆగాడు. తన ప్రార్థనా సూత్రాలలో ప్రభువైన యేసు, పట్టువీడక ఉండాలని పలు పాఠాలను నేర్పించాడు. నీవు విశ్వసించడం మానివేస్తే,

ప్రార్థించడం కూడా మానివేస్తావు. మన హృదయాంతరంగాల్లో, మనం ప్రార్థనను నిజంగా నమ్ముతున్నామా? “ముంగాళ్లమీదనున్న – తాత్వికునికంటె మోకాళ్లమీదనున్న క్రైస్తవుడు ఎక్కువగా చూడగలుగుతాడు.”[1]

ప్రార్థన చేయ నిలుపకు,
జవాబు ఆలస్యమైనట్టయితే,
ఆగు, దేవుడు వస్తాడు,
ఆయన ఎక్కువ ఆలస్యంగా రాడు.

(4) **దేవుడు “బదులుగానుంచుతాడు.”** ఆయన వ్యత్యాసమానమైన దానిని పంపుతాడు – లేక యింకా శ్రేష్ఠమైనదానిని – మనం అడిగిన దానికంటె అధికంగా యిస్తాడు. పాలస్తీనాలో ప్రవేశింప అనుమతి కొరకు మోషే ప్రార్థించాడు. అతని మనవిని ఆయన అంగీకరించలేదు. పిస్గా కొండమీదనుండియు, రూపాంతరపు కొండ మీదనుండియు ఆయన అతనిని చూడనిచ్చాడు. లాజరును స్వస్థపరచడానికి ప్రభువైన యేసు రాలేదు, కాని ఆయన అతనిని మృతులలోనుండి లేపవచ్చాడు (యోహాను 11:43, 44). మార్త యేసును పునరుత్థానముగాను జీవముగాను చూడగలుగునట్లు ఆయన అతనిని బ్రదికించాడు. పునరుత్థానం యొక్క అతి శ్రేష్ఠమైన ఉపదేశాన్ని వేదనపడుతున్న స్త్రీలకు ప్రభువు యిచ్చాడు. పిల్లలు కోరిన దానిని తల్లిదండ్రులు ఇవ్వలేనప్పుడు, కొన్ని సార్లు అడిగిన దానికంటె శ్రేష్ఠమైనదానిని యిస్తారు. ఈ విషయాన్ని పౌలు రోమా 8:31, 32లో లేవనెత్తాడు: “ఇట్లుండగా ఏమందుము? దేవుడు మనపక్షముననుండగా మనకు విరోధియెవడు? తన సొంత కుమారుని అనుగ్రహించుటకు వెనుకతీయక మన అందరి కొరకు ఆయనను అప్పగించినవాడు ఆయనతోపాటు సమస్తమును మనకెందుకు అనుగ్రహింపడు?”

అంతర్యుద్ధంలో పరపక్షమున చేరిన సైనికుడు దీనిని చక్కగా వివరించాడు:

నేను సాధించేలా, దేవుని నేను బలమిమ్మని అడిగాను,
వినయముగా లోబడునట్లు నేను బలహీనుడుగా చేయబడ్డాను.
గొప్పవైన కార్యాలు నే చేయునట్లు, నేను ఆరోగ్యం కొరకు అడిగాను,
శ్రేష్ఠమైన వాటిని నే చేయునట్లు, నాకు బలహీనత పెట్టబడింది.
నేను సంతోషించునట్టుగా నేను ధనసంపదను అడిగాను,
నేను జ్ఞానినైయుండునట్లు పేదరికం యివ్వబడింది.
మనుష్యుల పొగడ్తను పొందునట్లు నేను అధికారాన్ని అడిగాను,
దేవుని అవసరం కావాలన్న బలహీనత ఉంది.
జీవితాన్ని అనుభవించునట్లు సమస్తం యివ్వమని కోరాను,
సమస్తాన్ని నేను అనుభవించునట్లు జీవితం అనుగ్రహింపబడింది.
నేను అడిగిన దేనిని నేను పొందలేదు, కాని నేను నిరీక్షించిన ప్రతిదాన్ని పొందాను.
నేను లక్ష్యపెట్టబడకపోయినా, పలుకబడని నా ప్రార్థనలకు జవాబు వచ్చింది.
నేను, మనుష్యులందరిలో, గొప్పగా ఆశీర్వదింపబడ్డాను.

సొలొమోను జ్ఞానం కొరకు వేడుకున్నాడు (1 రాజులు 3:6–9). జ్ఞానాన్ని మాత్రమే కాకుండ దేవుడు అతనికి ఐశ్వర్యాన్ని, శాంతిని, అధికారాన్ని కూడా ప్రసాదించాడు.

తన చిన్న ప్రార్థనలు జవాబులు పొందనప్పుడు నరుడు తరచుగా నిరాశ చెందుతాడు. నరుని ప్రార్థనలు బహు చిన్నవైయున్నప్పుడు దేవుడు నిరాశపడతాడు.

(5) **దేవుడు "మనలను మార్చుతాడు."** దేవుడు మనలను మార్చుతాడు గనుక ప్రార్థనలు పరిస్థితులను మార్చుతాయి. ఎవరియందు నీకు విశ్వాసముంటుందో వానికి నిన్ను నీవు అప్పగించుకొంటావు. మనం ప్రార్థించినప్పుడు ఫలితం వేరుగా ఉంటుంది. మనం ఎక్కువ బలంకొరకు ప్రార్థించాలే గాని తక్కువ సమస్యల కొరకు ప్రార్థించ కూడదు. విశాలమైన భుజాల కొరకే ప్రార్థించాలి కాని బరువు తేలికపరచుకోడానికి కాదు. జవాబు పొందిన ప్రార్థనలలో మహా గొప్ప అద్భుతం దీవెన కావచ్చు – మన జీవితాల్లో దేవుడు కార్యం చేస్తున్నట్టు కన్పించవచ్చు. దేవుడు మన జీవితాల్లో పని చేస్తున్నాడని ఎరగడం మహా గొప్పది. ప్రార్థించడం అంటే మార్చుకొనడం, దేవునికి జీవితాన్ని తెరిచి ఉంచడం.

(6) **దేవుడు మనకు "దేవుని" యిస్తాడు.** దేవుడు వాటిని మనకు ప్రసాదించినట్టయితే, కొన్ని జవాబులను మనం చేపట్టలేం. మనకు వివరణలు అక్కరలేదు, – మనకు దేవుడు కావాలి! దేవుడు! దేవుడు తానే వస్తాడు! ప్రార్థన శక్తివంతమయ్యింది ఎందుకంటె దేవుడు శక్తిమంతుడు. ప్రార్థన మనలను దేవుని సన్నిధిలో పెడుతుంది. ఎంత ఎక్కువగా మనం దేవుని సన్నిధిలో గడుపుతామో అంత ఎక్కువగా మనం దేవునిలా మారతాం. మనం ఆరాధించే దేవునిలా మనం మారతాం. దేవుడు మోషే వద్దకు, దావీదు వద్దకు, యోబు వద్దకు, ప్రవక్తల వద్దకు, పౌలు వద్దకు వచ్చాడు. ప్రార్థనకు అతి గొప్ప జవాబు దేవుని ప్రసన్నత. దేవుడు మనకు ఏమి "చేస్తాడో" అనే దానికంటె దేవుడు ఎవరో "ఆయన" మనకు అతి ముఖ్యమైయున్నాడు.

"ప్రభువా, నేను ప్రార్థనయందు నమ్మికయుంచను.
నేను నీయందు విశ్వాసముంచుచున్నాను.
విశ్వాసంతో ప్రార్థన చేయ నాకు నేర్పించండి."

---

సూచన

[1]Augustus Toplady.